క్లుప్తంగా

సంగీత సాధనపై అవగాహన

లక్ష్మీపురం: సంగీత సాధన ఓ దివ్య తపస్సు వంటిదని సంగీత విద్వాంసులు పి.ఎస్.మూర్తి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'మనమూ పాడుదాం రండి' బృంద సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత సాధన ద్వారా ఏకాగ్రత, మనోవికాసం పెరుగుతాయన్నారు. సంగీతం ఒక విశ్వ భాష అని, సంగీతానికి పేద, ధనిక, కుల, మతాల, ప్రాంత సరిహద్దులు, సాంస్కృతులు, వర్ణ, వర్గ, వివక్షలు, భాషా భేదాలు ఉండవన్నారు. సుస్వర సంగీతం అందరినీ అలరిస్తుందన్నారు. సంగీత విద్వాంసులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల నుంచి సుఖాలకు, మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత వైపుకు, చీకటి నుంచి వెలుతురు వైపుకు నడిపించే పవిత్ర మాధ్యమమే సంగీతం అన్నారు. కార్యక్రమంలో గాయకులు వై.లక్ష్మి, రాజశేఖర్, సాయిబాబు గీతాలను ఆలపించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కొల్లిపర: గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయిన యువతి గురించి సోమవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ పి కోటేశ్వరరావు తెలిపారు. కెఎల్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 20 సంవత్సరాలు యువతి బంధువుల ఇంటికి వచ్చింది. అయితే మూడు రోజులు తరువాత ఎవరికీ చెప్పకుండా ఇంటి వెళ్లి పోవటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతిరావు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. జిల్లా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ సభ్యుడు దారా సాంబయ్య, బీజేపీ రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జ్ మకుటం శివ, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర పబ్లిసిటీ – లిటరేచర్ డిపార్ట్‌మెంట్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ పాల్గొన్నారు.

నీట్‌పై ఉచిత అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్–2026కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు మూడు రోజులపాటు ఉచిత వసతితో కూడిన అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన మెటామైండ్ అకాడమీ అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ శ్రీకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసి, 2025 నీట్‌లో ర్యాంకు సాధించని విద్యార్థులకు అవగాహన తరగతులు ప్రయోజనం చేకూర్చుతాయని తెలిపారు. ఈనెల 26, 27, 28వ తేదీల్లో శంషాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్న తరగతుల్లో భాగంగా నీట్ సిలబస్, ప్రిపరేషన్ విధానం, పరీక్షలో చోటు చేసుకుంటున్న మార్పులు, నోట్సు తయారీ, మెంటార్‌షిప్ తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 89777 59277, 89777 59166లో సంప్రదించాలని సూచించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరల్డ్ విటిలిగో(బొల్లి నివారణ దినం) సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్కిల్ పర్‌ఫెక్ట్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ కాస్మోటాలజిస్ట్ డాక్టర్ మన్నె సింధూర తెలిపారు. స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని తమ హాస్పటల్‌లో ఈనెల 25 నుంచి వారం రోజులపాటు ఉచిత ఓపీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. చర్మంపై కనిపించే ప్రతి తెల్లమచ్చ విటిలిగో కాదన్నారు. తెల్లమచ్చలను నూటికి 90 శాతం మందులతో నయం చేయవచ్చు అన్నారు. శరీరంపై ఎలాంటి మచ్చలు ఉన్నా సందేహాలు వీడి వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని కోరారు.

బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శన

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని కేంద్ర గిడ్డంగుల సంస్థ వద్ద ఏర్పాటు చేసిన హెచ్‌డీ నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మంజీర్ జిలానీ సమూన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. హెచ్‌డీ నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లలో రైతులు పండించిన పంట మొత్తం ప్రభుత్వం నిర్ణయించిన గ్రేడ్‌ల వారీ ధరలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వారిలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ టి.నరసింహారెడ్డి, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరి గోపాలం, శ్రీనివాసరావు ఉన్నారు.

యువతనూ వేధిస్తున్న బొల్లి సమస్య

- అందుబాటులో ఆధునిక శస్త్రచికిత్సలు
- రేపు వరల్డ్ విటిలిగో డే

గుంటూరు మెడికల్: రోజులు మారాయి. ఒత్తిడి వేధిస్తోంది. ఫలితంగా యువత రోగాల బారిన పడుతున్నారు. అందులో బొల్లి సమస్య ఒకటి. యువతలోనూ అధికంగా కనిపిస్తుండడంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 25న వరల్డ్ విటిలిగో డే నిర్వహిస్తున్నారు.

మెలనోసైట్స్ నశించటంతో..

బొల్లి (విటిలిగో) అనేది ఒక చర్మ సమస్య. ఈ సమస్యతో బాధపడేవారి చర్మంలో రంగును ఇచ్చే కణాలు(మెలనోసైట్స్) నశించడం వలన చర్మం మీద తెల్లమచ్చలు ఏర్పడతాయి. లింగ భేదం లేదు. ఇది చర్మానికి సంబంధించిన వ్యాధి మాత్రమే. అంటు వ్యాధి కాదు. బొల్లిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవటం, అపోహలు ఉండటంతో వ్యాధికి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

కారణాలు....

బొల్లి రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన కారణాలు, దీర్ఘకాలిక ఒత్తిడి, విటమిన్లు లోపించడం, కొన్నిసార్లు కాలిన గాయాలు, ప్రమాదాల వలన ఏర్పడిన గాయాలు మానకపోవటం, దీర్ఘకాలిక గ్యాస్ట్రిక్ సమస్యలు, దీర్ఘకాలిక కాలేయ వ్యాధి, చర్మంపై ఉండే పచ్చబొట్లు, కొన్ని రకాల ఔషధాల వలన ఏర్పడే దుష్పరిమాణాలు, కొన్ని రసాయనాల పరిశ్రమల్లో పనిచేయటం, హార్మోన్స్ లోపం, థైరాయిడ్, డయాబెటిస్, మన వ్యాధి నిరోధక శక్తి మనకే ముప్పుగా పరిణమించే ఆటో ఇమ్యునో డిసీజ్‌ల వలన రావచ్చు.



చికిత్స ఇలా..

జిల్లాలో 60 మంది చర్మవ్యాధి వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతిరోజూ ఒక వైద్యుడి వద్దకు ఐదుగురు నుంచి పది మంది బొల్లి సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. ఈ వ్యాధి బాధితుల సంఖ్య ప్రతిరోజూ పెరిగిపోతూ ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు....

చిన్న చిన్న తెల్లమచ్చలుగా మొదలై ఆ తరువాత మిగతా శరీరానికి వ్యాపిస్తుంది. మచ్చల మీద జుట్టు రంగు కూడా మారుతోంది. చర్మ పలుచబడినట్లు అవుతుంది. కొన్నిసార్లు ఎండ వేడిని తట్టుకోలేరు. జుట్టు రంగు మారిపోవటం, జుట్టు రాలిపోవటం జరుగుతుంది. ముఖ్యంగా కాళ్లు, చేతులు, పెదవుల మీద మచ్చలు ఎక్కువగా వస్తాయి. కొన్నిసార్లు జననాంగాలు, ఇతర అవయవాలపైన మచ్చలు వస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే బొల్లి మిగతా శరీరానికి సోకే అవకాశం ఉంది. గాయాలు తగలకుండా చూసుకోవాలి. పొగతాగకూడదు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి. ప్రతిరోజూ సరిపడా నీటిని తాగాలి. బొల్లికి పూతమందులు, ఫొటోథెరఫీ, స్టెరాయిడ్స్, నోటి ద్వారా మందులు, గ్రాఫ్టింగ్, ట్యాటూయింగ్, లేజర్, వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. శరీరంపై ఉన్న బొల్లి మచ్చలను కవర్ చేసుకోవడానికి కామోఫ్లేజ్ క్రీములు అందుబాటులో ఉన్నాయి.

– డి.ఎస్.ఎస్.శ్రీనివాస్‌ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

ఆధునిక చికిత్సతో చెక్‌పెట్టవచ్చు...



బొల్లికి ఆధునిక చికిత్సలు, ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక వైద్య చికిత్స ద్వారా బొల్లి మచ్చలను మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో తిరిగి సాధారణ స్థితికి తీసుకు రావచ్చు. ఈ చికిత్సలో శరీరంలో రంగును ఇచ్చే కణాలను (మెలనోసైట్స్) గ్రాఫ్టింగ్ ద్వారా ఉత్పత్తి చేసి తెల్లమచ్చలు ఉన్నచోట అమరుస్తారు. నూటికి 70 నుంచి 90 శాతం మెరుగైన ఫలితాలు ఈచికిత్స ద్వారా లభిస్తున్నాయి. బొల్లి అనేది చర్మ సమస్య మాత్రమే రోగం కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– డాక్టర్ మన్నె సింధూర, స్కిన్ స్పెషలిస్ట్, గుంటూరు

బొల్లి ఉన్నవారు శారీరకంగా కంటే మానసికంగా ఎక్కువగా ఒత్తిడికి గురవుతారు. కొందరు బాగా డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సూచించారు. డయల్ యువర్ కమిషనర్‌కు అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకుని మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలని కోరారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 12, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి సంబంధించి 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సీపీ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏసీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,200 కోట్లు వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ కోరారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల నాటికి రాష్ట్రంలో రూ.3,900 కోట్ల బకాయిలు ఉన్నాయని, సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2600 కోట్లు కేటాయించిందన్నారు. కానీ ఇంత వరకు రూపాయి విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివా, యశ్వంత్ ఉపాధ్యక్షులు ప్రణీత్, అమర్నాథ్, సహాయకార్యదర్శి డేవిడ్, కిరణ్, అజయ్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బందెల నాసర్ జీ

ఖాతాదారుల ఉన్నతికి ఏలూరి బ్యాంక్ కృషి

కొరిటిపాడు(గుంటూరు): ఏలూరి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రస్తుతం ఉన్న రూ.200 కోట్ల వ్యాపారానికి గానూ 18 శాతం డివిడెండ్‌ను వాటాదారులకు పంపిణీ చేయనున్నట్లు బ్యాంక్ చైర్మన్ ఏలూరి గురవయ్య పేర్కొన్నారు. ఏలూరి కో–పరేటివ్ అర్బన్ బ్యాంక్ 26వ వార్షిక సాధారణ సమావేశం సోమవారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రూ.200 కోట్ల వ్యాపారంను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్లకు పెంచాలని సభ్యులకు సూచించారు. డైరెక్టర్లు ఏలూరి దత్త వెంకటకుమార్, బాల దత్తకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ఐఎంపీఎస్ ఆన్‌లైన్ సేవలతోపాటు బ్యాంక్ డెబిట్ కార్డులు, యూపీఐ సేవలు కూడా ఖాతాదారులకు త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. మరో డైరెక్టర్ చింతా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్కో వాటాదారుడు ఐదు మంది నూతన ఖాతాదారులను చేర్పించాలని సూచించారు. బ్యాంక్ ముఖ్య అధికారి పీవీ శర్మ మాట్లాడుతూ బ్యాంక్ 2024 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభం, నిల్వ వివరాలు, 2025–26లో బ్యాంక్ బడ్జెట్ అంచనాలను సభకు వివరించారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ ఎన్.సీతారామయ్య, మట్టుపల్లి సుబ్బారావు, వనమా నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరి బ్యాంక్ చైర్మన్ ఏలూరి గురవయ్య

గిన్నిస్ వరల్డ్ రికార్డులో విద్యార్థుల భాగస్వామ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా 4,218 మంది విద్యార్థులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థుల బృందంలో స్టెమ్ స్కూల్ విద్యార్థులు భాగస్వాములుగా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ భరత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థినులు సిహెచ్.సంజన, సిహెచ్.జస్మితను ఫాదర్ భరత్‌రెడ్డితో పాటు వైస్ ప్రిన్సిపాల్ అనుపమ అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఏఎన్‌యూ సైబర్ సెక్యూరిటీ అధ్యాపకుడు డాక్టర్ వీర రాఘవరావు పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ(స్టెప్–స్వశక్తి) ఆధ్వర్యంలో సోమవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్, మహిళల అక్రమ రవాణా అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వీర రాఘవరావు మట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని అందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సైబర్ క్రైం బాధితులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీం నంబరు 1930కు ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగాధిపతి రాజేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా యువత ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవడంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థినులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని రంగాల్లో ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వీర రాఘవరావు

అలరించిన సినీ సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో సోమవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళాంజలి కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఔత్సాహిక గాయనీ గాయకులు పాత, కొత్త గీతాలు అలపించారు. ప్రేక్షకులను అలరించాయి. అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కళాంజలి కళావేదిక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆరికపూడి సాంబశివరావు, అన్నదాన సమాజం మాజీ చైర్మన్లు మిరియాల ప్రసాదరావు, గోపి కుమార్ మాట్లాడారు. అనంతరం గాయనీ గాయకులను సన్మానించారు.

సీపీఐ 8వ డివిజన్ మహాసభ

లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో పేద ప్రజలు నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పాతగుంటూరు 8వ డివిజన్ శాఖ మహాసభ డివిజన్ నాయకులు కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజి బాబు, ఏవైఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఒలింపిక్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జేకేసీ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ పర్యవేక్షణలో పరుగు పందెం, ఆర్మ్ రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, దేహదారుఢ్యం, డాడ్జ్ బాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆంగ్ల అధ్యాపకురాలు పి.నాగసుశీల, ఫిజికల్ డైరెక్టర్లు తుమ్మల శ్రీనివాసు, ఎం.అనిల్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గౌరీశంకర్, డాక్టర్ వై.ప్రశాంతి, డాక్టర్ ఎస్. మాధవి, ఆర్. శ్రీనివాసరావు, రాహుల్, అజయ్‌బాబు, సీహెచ్ రామ్‌ప్రసాద్, డాక్టర్ కేవీఎల్ఎన్ అప్పలాచార్యులు, డేనియల్, రామకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మురళీమోహన్, గోపీచంద్ అధ్యాపకులు

మహిళలను గౌరవించడం సమాజానికి గౌరవప్రదం

నగరంపాలెం: భారతీయ సాంస్కృతిక జీవన విధానంలో మహిళలకు అగ్రస్థానం ఇచ్చారని, వారిని గౌరవించడం సమాజానికి గౌరవప్రదమని ప్రముఖ విద్యావేత్త నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు అన్నారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సత్కార సభ నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న విశిష్ట మహిళలు ప్రముఖ న్యాయవాది, రచయిత్రి నల్లూరి రుక్మిణి, గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం వై.శేషురాణి, ప్రముఖ బుర్రకథ కళాకారిణి యడవల్లి శ్రీదేవిలను జ్ఞాపిక, సన్మాన పత్రాలతో సత్కరించారు. గుళ్ళపల్లి సుబ్బారావు గత రెండు దశాబ్దాలుగా విద్యా, సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలకు అందిస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. సభకు అర్థలపూడి నేహా అధ్యక్షత వహించారు. యడవల్లి శ్రీదేవి బృందం కల్యాణం బుర్రకథ ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో ఎం.వేదవతి, గుళ్లపల్లి స్వాతి, గుళ్లపల్లి రాఘవేంద్రరావు, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య పాల్గొన్నారు.



విశిష్ట మహిళలకు సత్కారం

బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

తాడికొండ: అమెరికాకు చెందిన సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, సతీమణి కళ్యాణీ ప్రసాద్ కృషితో జిల్లాలో సకల హంగులు, సౌకర్యాలతో బీసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించ తలపెట్టిన బీసీ కమ్యూనిటీ హాల్‌కు స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతల సేవా గుణాన్ని కొనియాడారు. జిల్లాలో 9 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేస్తుండగా తాడికొండ నియోజకవర్గంలోనే రావెల, పెదపరిమి, పొనుగుపాడు గ్రామాల్లో 3 నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు, జనసేన కన్వీనర్ బేతపూడి విజయ్‌శేఖర్, స్థానిక నాయకులు పువ్వాడ సుధాకర్, పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, జనసేన అధ్యక్షులు నాగరాజు, తహసీల్దార్ సుజాత పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నేతలు

లక్ష్మీపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.వి.ఎస్.కుమారి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ వలన అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. యాప్ పనిచేయడానికి కావాల్సిన నెట్‌వర్క్, సెల్ ఫోన్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, కే.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.హుస్సేన్ వలి, నాయకులు గాంధీ రామ్మోహన్‌రావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రేమ్ కుమారి, రత్న మంజుల, విజయలక్ష్మి, రాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు





శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇప్పటికే పోలీసులు వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు ప్రకటించారు. తొలి రోజు పనులతో ప్రజలు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు. అడుగడుగునా ఆటోలు, వాహనాల చోదకులు అవస్థలు పడ్డరు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు